





ఆది దంపతులకు తెప్పోత్సవం



పుష్కరిణిలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం



చండీశ్వరస్వామికి మల్లికార్జున గుండం వద్ద అవభృథస్నానం

అమ్మవారి నిజ రూప దర్శనం

శ్రీశైలం, అక్టోబరు 13: దసరా మహోత్సవాల్లో భాగంగా శనివారం చివరి రోజు స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. అమ్మవారు భ్రమరాంబదేవి నిజరూపాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు నందివాహనసేవను అశేష భక్తుల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఆలయ పుష్కరిణి వద్ద తెప్పోత్సవం నిర్వహించారు. ఉత్సవాల చివరి రోజు ఉదయం అమ్మవారి యాగశాలలో చండీయాగ పూర్ణాహుతి, స్వామివారి యాగశాలలో రుద్రయాగపూర్ణాహుతి కార్యక్రమాలు జరిపారు.



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు



భ్రమరాంబదేవికి ప్రత్యేక పూజలు

అమ్మవారికి నందివాహన సేవ


దసరా ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు శనివారం అమ్మవారిని నవదుర్గా అలంకరణలలో ఒకటైన భ్రమరాంబాదేవి నిజరూపాలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో డి. పెద్దిరాజు, ఆలయ అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయ నృత్యం



శమీపూజ

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో ఉన్న శమీ వృక్షానికి శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. నందివాహనంపై ఆశీనులైన స్వామి, అమ్మవార్లను శమీ వృక్షం వద్దకు తోడ్కొని వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.




శ్రీశైల క్షేత్రంలో గ్రామోత్సవం





నందివాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

లాటరీలో లక్ ఎవరికో...?



- నేడు మద్యం షాపుల లక్కీడ్రా
- 105 షాపులకు 2,221 దరఖాస్తులు
- జిల్లాకు రూ.44.42 కోట్ల ఆదాయం
- నేడు పదిన్నరకు కలెక్టర్ సమక్షంలో డ్రా

నంద్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): **మద్యం షాపులకు దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. ఇక మిగిలింది లక్కీ డ్రా తీయడమే. జిల్లా వ్యాప్తంగా 105 షాపులకు 2,221 టెండర్లు అందాయి. వీటికి సంబంధించి నేడు కలెక్టర్ సమక్షంలో లక్కీడ్రా తీయనున్నారు. ఎవరికి ఏ షాపు దక్కుతుందో, ఎవరిని అదృష్టం వరించనుందోనని టెండరు దారులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.**

భారీగా ఆదాయం..

జిల్లా వ్యాప్తంగా ఉన్న షాపులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ల ద్వారా వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖకు సంబంధించి ఏడు సర్కిళ్లు ఉన్నాయి. ఈ సర్కిళ్లకు సంబంధించిన ఒక్కో షాపునకు రూ.2 లక్షల దరఖాస్తు ఫీజుగా కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. టెండరుదారులు చెల్లించే డబ్బు పూర్తిగా ప్రభుత్వానికే దక్కుతుంది. ఇలా జిల్లాలోని 2,155 షాపులకు దరఖాస్తు ఫీజు రూ.44.42 కోట్లు దక్కాయి. ఇక టెండరు దక్కించుకున్న టెండరు దారులు షాపును రెండేళ్ల వరకు నడిపించుకోవచ్చు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా పెంచిన మద్యం ధరలను కూటమి ప్రభుత్వం తగ్గించింది. అంతేకాకుండా గత ప్రభుత్వం మద్యంపైన వేసిన పది రకాల పన్నులను ఆరుకు కుదించింది. దీంతో పాటు క్వార్టరు మద్యాన్ని రూ.99కే అందేలా చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల మద్యం బాబులకు తక్కువ ధరకే నాణ్యమైన సరుకు అందే అవకాశం ఉంది. వైసీపీ ప్రభుత్వం తీరు వల్ల కాస్ట్లీ బ్రాండ్లు దొరక్క ఇబ్బంది పడ్డ మందు బాబులకు ఎక్కువ రేటు మద్యం కూడా రేపటి నుంచి మంచి మందు దొరకనుంది.

ఒక్కో దుకాణానికి..

గత ప్రభుత్వంలో అధికార పార్టీనే మద్యం షాపుల నిర్వహణను చూసుకుంది. ఆ మందు తాగి చాలామంది అనారోగ్యం పాలు కావటమే కాకుండా, కొంతమంది ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నంద్యాల జిల్లాకు ఏడు సర్కిళ్ళకు 105 షాపులను కేటాయించింది. అక్టోబరు ఒకటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మద్యం షాపులకు టెండర్లను పిలిచింది. దీంతో జిల్లాలోని మద్యం షాపులకు టెండరుదారులు భారీగానే దరఖాస్తులు సమర్పించారు. ఈ నెల 11వ తేదీ నాటికి జిల్లాలోని ఆయా షాపులకు 2,221 టెండర్లు వచ్చాయి. ఈ లెక్కన ఒక్కో షాపుకు దాదాపు 21 దరఖాస్తులు వచ్చినట్లు అంచనా! ఈ దరఖాస్తులను అన్నింటిని కలెక్టర్ సమక్షంలో సోమవారం లక్కీ డ్రా తీయనున్నారు.

ఇక కూటమి ప్రభుత్వం కొత్తగా మాదక ద్రవ్యాల నియంత్రణ సుంకం వసూలు చేయనుంది. ఇలా వసూలు అయిన నిధులను గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల నియంత్రణపై చర్యలు తీసుకునేందుకు, వ్యసనపరులకు విముక్తి కల్పించేందుకు కౌన్సిలింగ్ కేంద్రాలను నెలకొల్పేందుకు వినియోగించనుంది.

మద్యం షాపుల వేలానికి బందోబస్తు : ఎస్పీ

నంద్యాల క్రైం, అక్టోబరు 13 : నంద్యాల జిల్లాలో సోమవారం ఏర్పాటు చేయనున్న 105 మద్యం షాపుల వేలం పాట ప్రక్రియకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదివారం తెలిపారు. వేలం ప్రక్రియ నంద్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద గల సెంటినరీ హాల్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 105మద్యం షాపులకు 2,221 మంది ఔత్సాహికులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. బందోబస్తు విధుల్లో 9మంది సీఐలు, 15మంది ఎస్సైలు, 44మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 54మంది పోలీస్ కానిస్టేబుళ్లు, ఆరుగురు మహిళా కానిస్టేబుళ్లు, ముగ్గురు హోంగార్డులు వెరసి మొత్తం 131మంది సిబ్బంది పాల్గొంటున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఏర్పాట్లను పరిశీలించినవారిలో ఎస్పీతోపాటు అడిషనల్ ఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు, ఏపీఈఎస్ వి. రాముడు, ఇన్‌స్పెక్టర్లు సూర్యమౌళి, హనుమంత్‌నాయక్, వంశీధర్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

విడతల వారీగా..

పట్టణాల్లో, మండల పరిధిని బట్టి జిల్లాలో రూ.55 లక్షలు, రూ.65 లక్షల స్లాబులను నిర్ణయించారు. టెండరు దక్కించుకున్న వారు ఆయా షాపును బట్టి ఈ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇంత పెద్ద మొత్తం ఒకేసారి చెల్లించాల్సిన అవసరం లేకుండా ఆరు విడతల్లో చెల్లించే విధంగా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. మద్యం షాపులకు లక్కీ డ్రాను నేడు నంద్యాలలోని కలెక్టరేట్ ఆవరణలోని సెంటినరీ హాలులో తీయనున్నారు. ఉదయం 8 గంటల నుంచి కలెక్టర్ సమక్షంలో ఈ ప్రక్రియ మొదలుకానుంది. టెండరు దాఖలు చేసిన వారికి మాత్రమే లోపలికి అనుమతించనున్నారు. లక్కీ డ్రా ప్రక్రియ ముగిసిన వెంటనే 15వ తేదీ నుంచి కొత్త మద్యం దుకాణాలు అందుబాటులోనికి రానున్నాయి.

దసరా వేడుకలకు పూర్ణాహుతి

- నిజరూప అలంకారంలో అమ్మవారి దర్శనం
- జమ్మిచెట్టుకు ఉత్సవం
- ఆకట్టుకున్న వేషధారణలు



మహానందిలో పూర్ణాహుతి చేస్తున్న దృశ్యం

మహానంది, అక్టోబరు 13: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు మహానందిలో పూర్ణాహుతితో వైభవంగా ముగిసాయి. శనివారం ఉదయం ఆలయంలో వేదపండితులు స్వామి, అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం యాగశాల మంటపంలో ఈవో నల్లకాల్వ శ్రీనివాసుల రెడ్డి దంపతుల చేత వివిధ ద్రవ్యాలతో పూర్ణాహుతి కార్యక్రమం జరిపారు. సాయంత్రం అమ్మవారు నిజరూప అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రత్యేక పల్లకిలో అమ్మవారిని ఆశీనులు గావించి పూజలు చేశారు. అనంతరం ఆలయ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. మహానంది శివారు ప్రాంతంలోని ఈశ్వర్‌నగర్ కాలనీ వద్ద ఉన్న జమ్మి చెట్టు వద్దకు ఉత్సవమూర్తిని తీసుకొచ్చి వేదమంత్రాలతో శమీ పూజను జరిపారు. మహానందికి చెందిన యువకులు నిర్వహించిన దసరా వేషధారణలు పలువురిని ఆకట్టుకొన్నాయి.

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 13: కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం పల్లెపండుగ -పంచాయతీ వారోత్సవాలు, మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ ఉన్న నేపథ్యంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు గమనించాలని కోరారు.

దేవరగట్టు.. రణరంగం..!

- ఉత్కంఠగా సాగిన బన్ని కర్రల సమరం
- 80 మందికి గాయాలు
- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- నేడు మాళ మల్లేశ్వరస్వామి రథోత్సవం

ఆలూరు/హొళగుంద, అక్టోబరు 13: దేవరగట్టు ఉత్సవాలు రణరంగాన్ని తలపించాయి. ఉత్సవమూర్తులను దక్కించుకునేందుకు జరిగిన కర్రల సమరంలో మరోసారి భక్తుల తలలు పగిలాయి. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం అర్ధరాత్రి మాళమల్లేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం 12 గంటలకు ఉత్సవ మూర్తులను దక్కించుకునేందుకు వేలాది మంది భక్తులు పోటీ పడ్డారు. ఈ కర్రల సమరంలో 80 మందికిపైగా గాయాలయ్యాయి. మరికొంతమందికి తీవ్ర గాయాలయ్యాయి. కాగడాల నిప్పు రవ్వలు పడి మరికొందరు గాయపడ్డారు. వారిని ఆదోని, ఆలూరు ప్రభుత్వాసుపత్రులకు తరలించారు.

- వివరాలు 7లో...









రక్తం చిందిన దేవరగట్టు

ఆలూరు/హొళగుంద/కర్నూలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి 12.45 గంటలు.. డిర్‌ర్‌ర్ గోపరాక్ (బహంపరాక్) అంటూ వేలాదిగా భక్తగణం దేవరగట్టుపైకి చేరుకుంది. తలకు పాగచుట్టి.. చేతిలో కర్రపట్టి యుద్ధానికి సిద్ధమైన సైనికుల్లా దేవుడి కార్యంలో నిమగ్నమయ్యారు. శుభముహూర్తం అర్ధరాత్రి ఒంటి గంటకు వేదపండితులు రవి శర్మ మాళ మల్లేశ్వరస్వాముల కల్యాణోత్సవం నిర్వహించారు. జైత్రయాత్రకు సై అంటూ ఉత్సవమూర్తులతో కొండ దిగి సింహాసన కట్టవద్దకు చేరుకోగా.. దేవుడి దక్కించుకోవడానికి అప్పటికే అక్కడికి చేరుకున్న పలు గ్రామాల భక్తులు కర్రలతో మేము సైతం అంటూ కదనరంగంలోకి దిగడంతో.. బన్ని ఉత్సవం (కర్రల సమరం) మొదలైంది. 800 అడుగుల పైభాగాన ఉన్న దేవరగట్టుపై దాదాపు అరగంట పాటు బన్ని ఉత్సవం జరిగింది. ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండలం దేవరగట్టు వేదికగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జరిగిన ఉత్సవాన్ని కళ్లార వీక్షించాలని రాష్ట్ర నలమూలల నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు.

కాళరాత్రి.. కాగడాల వెలుగుల్లో..

నెరిణికి, నెరిణికి తండా, కొత్తపేట గ్రామాల భక్తులు ఉత్సవమూర్తులను పల్లకిలో కొండపై నుంచి దిగువన సింహాసన కట్టపైకి చేర్చి మహా మంగళహారతి ఇచ్చారు. పల్లకి భక్తులు భుజంపై మోసుకోగా.. ఆ పల్లకి రక్షకులుగా కర్రలతో పైగ్రామాల భక్తులు పల్లకి చుట్టూ చేరారు. ఎలాగైనా దేవుడిని తమవశం చేసుకోవాలని అరికెర, అరికెరతండా, కురుకుంద, బిలేహాల్, సుళవాయి, ఎల్లార్తి, విరుపాపురం గ్రామాల భక్తులు కర్రలు, కాగడాలతో అడ్డుకున్నారు. అప్పుడు సమయం అర్ధరాత్రి 1.20 గంటలు. దేవుడిని కాపాడుకోవడం కోసం పైమూడు గ్రామాల భక్తులు, తమవశం చేసుకోవాలని మిగిలిన గ్రామాల భక్తగణం డిర్‌ర్‌ర్ గోపరాక్ అంటూ సమరానికి సై అంటూ తపడ్డారు. కాళరాత్రి.. కాగడాల వెలుగుల్లో తలలపై వేలాది కర్రలు నాట్యం చేశాయి. పసుపు (బండారు) వర్షంలో మల్లయోధుల్లా తలపడ్డారు. ఒకసారి దేవుడి రక్షకులైన భక్తులు తగ్గితే.. మరోసారి ఆ దేవుడిని సొంతం చేసుకోవాలనే గ్రామస్థులు తగ్గారు. కొట్టేవారు కొడుతున్నారు.. కిందపడ్డవారు లేచి మళ్లీ సమరానికి సిద్ధమయ్యారు. అర గంటకు పైగా అంటే 1:50 గంటల వరకు బన్ని ఉత్సవం సాగింది. ప్రతిఏటలాగే నెరిణికి, నెరిణికితండా, కొత్తపేట గ్రామస్థులే విజయం సాధించి.. ఉత్సమూర్తుల పల్లకితో జైత్ర యాత్ర సాగించారు. దట్టమైన అడవి ప్రాంతంలో ముళ్లపడ, పాదలకట్ట వద్దకు చేరుకొని పూజలు చేశా రు. అక్కడి నుంచి రాక్షసపడకు చేరుకొని శివుడి ఆజ్ఞానుసారం కంచెవీరబసవరాజు అనే గొరవయ్య 11 మూరల దారం కాలుపక్కి రంధ్రంలో నుంచి తీసి రాక్షసుడికి రక్తార్పణం చేశాడు. అక్కడి నుంచి ఉద యం 6:15 గంటలకు ఎదురు బసవన్న గుడికి చేరు కున్నారు. ప్రధాన అర్చకులు గిరిమల్లయ్య స్వామి భవిష్యవాణి (కార్ణీకం) వల్లించిన తరువాత ఉత్సవ మూర్తుల పల్లకిని సింహాసనం కట్టపైకి చేర్చి హారతి ఇవ్వడంతో బన్ని జైత్రయాత్ర ముగిసింది. సోమ వారం స్వామివారి రథోత్సవం జరుగుతుంది.

పగిలిన తలలు.. చిందిన రక్తం

దేవరగట్టు బన్ని ఉత్సవంలో కర్రలే పట్టు సాధించాయి. ఎలాగైనా కర్రలు లేకుండా ఉత్సవాలు జరపాలని నెల రోజుల నుంచి కలెక్టరు పి.రంజిత్‌బాషా, ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాదు కొండపైకి చేరుకునే దారుల్లో ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేసి జనం చేతుల్లో కర్రలు తీసుకున్నారు. పోలీసులు ప్రయత్నాలు చివరికి విఫలం కాకతప్పలేదు. ఆచారం మాటున సాగిన ఆటవిక సమరంలో తలలు పగిలి రక్తం చిందింది. 80 మందికి గాయపడగా.. స్థానికంగా ప్రభుత్వం వైద్య శిబిరంలో చికిత్స అందించగా.. తీవ్ర గాయాలైన 18 మందిని ఆలూరు, ఆదోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చిన్నచిన్న గాయాలకు స్వామి బండారు పూసుకున్నారు. ఈ ఉత్సవాలను ఎస్పీ బిందుమాధవ్ పర్యవేక్షించారు. గుంతకల్లు, ఆలూరు ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, విరూపాక్షి, టీడీపీ ఆలూరు నియోజకవర్గం ఇన్‌చార్జి బి.వీరభద్రగౌడ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్, డీఎస్పీ వెంకటరామయ్య పర్యవేక్షించారు.



ఆసుపత్రిలో క్షతగాత్రులు



దేవరగట్టుపై ఎస్పీ బిందు మాధవ్

దేవరగట్టులో భవిష్యవాణి



భవిష్యవాణి (కార్ణీకం) చెప్పిన పూజారి గిరి మల్లయ్య స్వామి

దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి బన్ని జైత్రయాత్రలో కీలక ఘట్టం భవిష్యవాణి (కార్ణీకం). బన్నీ జైత్రయాత్ర ఊరేగింపు అనం తరం ఆదివారం ఉదయం 6:15 నిమిషాలకు ఎదురు బసవన్న గుడి వద్ద పూజారి గిరి మల్లయ్య స్వామి భవిష్య వాణి వినిపించారు. దేవర గట్టులో చెప్పే భవిష్యవాణిపై రైతులకు ఎంతో నమ్మకం. పూజారి గోపర్రాక్ అనడంతో ఒక్కసారిగా భక్తులు నిశ్శబ్దాన్ని పాటించారు. కన్నడ భాషలో మాట్లాడుతూ

- పార్వతీదేవి దేశక్కే మల్లిగే హంగ్గాలే (పార్వతీ దేవి దేశంపై మల్లెపూలు చల్లింది)
- శక్తి ద్యాన మాడబెకు (శక్తి స్వరూపిణి అమ్మవారిని ధ్యానించాలి)
- గంగి హోలేదండిగే నింతు భరతాళ్లే (గంగమ్మ నది ఒడ్డున నిలిచి వస్తుంది.)

వర్షాలు అన్ని ప్రాంతాల్లో సమృద్ధిగా కురుస్తాయి.

- క్వింటాళ్ల 6. 700/- నగెహాళ్లె (పత్తి)
- క్వింటాళ్ల 3400 /-జ్వాళ (జొన్నలు)
- 3-6-6-3 మూడు ఆరు అవుతుంది. ఆరు మూడవుతుంది. వాణిజ్య పంటల ధరలు పెరిగి, తగ్గు ముఖం పట్టవచ్చన్నారు. రైతులు సంతోషంతో ఉంటారన్నారు.

అందరి సహకారంతో విజయవంతం : ఎస్పీ



అందరి సహకారంతో దేవరగట్టు బన్ని ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. దేవరగట్టు ఉత్సవాల అనంతరం ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉత్సవాల్లో కొందరికి చిన్నచిన్న గాయాలు తప్ప, ప్రాణాపాయం జరగలేదన్నారు. ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడిన వారిపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

విత్తనాభివృద్ధి పరిశ్రమలపై దృష్టి సారిస్తా

రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారెడ్డి



ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని సన్మానిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, అక్టోబరు 13: ఉమ్మడి కర్నూలు జిల్లాలో విత్తనాభివృద్ధి పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు నియోజకవర్గంలోని వేల్పనూరులో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని ఆయన నివాసంలో సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబుపై నమ్మకంతోనే రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు వస్తున్నాయన్నారు.

మంత్రాలయం వద్ద తుంగభద్ర పరవళ్లు

310.500 మీటర్ల నీటి మట్టం



మంత్రాలయం వద్ద పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర

మంత్రాలయం, అక్టోబరు 13: ప్రముఖ పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వద్ద తుంగభద్ర నది వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఆదివారం సాయంత్రం మంత్రాలయం వద్ద 310.500 మీటర్ల నీటి మట్టంతో 88వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. టీబీ డ్యాం నుంచి 82వేల క్యూసెక్కుల నీరు నదికి విడుదల చేశారు. డ్యాంలోకి 90వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో తుంగభద్ర నది రెండు వైపులా సరిహద్దులను తాకుతూ పరవళ్లు తొక్కుతోంది. దర్శనార్థం వచ్చి నదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు శ్రీమఠం అధికారులు మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నదితీర గ్రామాల ప్రజలను తాహసీల్దారు రవి, సీడబ్ల్యూసీ, పోలీసు అధికారులు గ్రామాల్లో దండోరా వేయిస్తూ అప్రమత్తం చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, అక్టోబరు 13: పట్టణంలోని రాఘవేంద్రపురానికి చెందిన జంగం సోముశేఖర్(27) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ కోదండ రామిరెడ్డి తెలిపిన మేరకు.. మృతుడు మంత్రాలయం ఓ హోటల్లో పనిచేసేవాడు. భార్యను శనివారం ఉదయం పండుగ నిమిత్తం అదే కాలనీలో ఉంటున్న అత్తమామల ఇంటికి పంపించాడు. రెండేళ్లుగా కడుపు నొప్పితో బాధ పడుతూ కర్నూలు, ఆదోని, రాయచూరు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా తగ్గక పోవడంతో శనివారం రాత్రి తన కొట్టంలో చీరతో ఉరివేసుకున్నాడు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య స్వర్ణ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు. కాగా మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మూడు నెలల బాలింతగా ఉన్న భార్య, పిల్లలతో భర్త మృతదేహంపై పడి రోధిస్తున్న దృశ్యం కంటతడి పెట్టించింది.

అశ్వాల పార్వేట

- యామన్ననగరి రాజుల విజయం
- శభాష్ అనిపించుకున్న జగదిల్ రాయుడు



యామన్ననగరి అశ్వంపై జగదీల్ రాయుడు



అశ్వాలపారువేట తిలకిస్తున్న ప్రజలు

మద్దికెర, అక్టోబరు 13: విజయదశమి రోజున నిర్వహించే అశ్వాల పార్వేటలో యామన్ననగిరి రాజులు విజయం సాధించారు. మద్దికెరలో పెద్దనగిరి, చిన్ననగిరి, యామన్న నగరి, యాదవరాజ వంశీకులు ఆదివారం అశ్వాల పార్వేటలో పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆనవాయితీగా వస్తున్న దసరా ఉత్సవాల్లో వారు పాల్గొన్నారు. అశ్వాలను ఉదయం గ్రామ శివారులోని భోజప్పబావికి తీసుకెళ్లి శుభ్రం చేసి తీసుకువచ్చారు. సాయంత్రం పెద్దనగిరి, చిన్ననగిరి, యామన్ననగిరి యాదవరాజులు రాజుల దుస్తులతో తలకు తలపాగా, చేతికి ఖడ్గం ధరించి అశ్వాలు, సైన్యంతో మేళతాళాలతో బయలుదేరారు. మద్దికెరకు మజరా గ్రామమైన బొజ్జనాయునిపేటలో యాదవరాజులు నిర్మించుకున్న భోగేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లి ఈ మూడు కుటుంబాల వారు ఆలయంలో పూజలు చేశారు. అనంతరం 4 కి.మీలు అశ్వాల పార్వేట పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో యామన్ననగరికి చెందిన జగదిల్‌రాయుడు మొదటి స్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో పెద్దనగిరి, తృతీయ స్థానంలో చిన్ననగిరికి చెందినవారు నిలిచారు. తరతరాలుగా వస్తున్న అశ్వాల పార్వేటను గ్రామ ప్రజలే కాకుండా ఇతర గ్రామాల నుంచి కూడ వచ్చి ప్రజలు ఆసక్తిగా తిలకించారు. గెలుపొందిన అశ్వంపై రాజులను మెయిన్‌బజారులో ఊరేగించారు.

సేవ ముసుగులో దగా..

- ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.1.50 లక్షలు
- స్వచ్ఛంద సంస్థ నిర్వాకం

కర్నూలు(ఎడ్యుకేషన్), అక్టోబరు 13: ఓ స్వచ్ఛంద సేవా సంస్థ నిరుద్యోగులకు రూ.15 వేల జీతం వచ్చే ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.1.5 లక్షల చొప్పున వసూలు చేసింది. ఆగస్టు 7న బుద్ధ యోగా ఫౌండేషన్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చి పాఠశాలలో పని చేయాలని స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఆదేశించారు. ఉత్తర్వులు తీసుకుని ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్దకు వెళితే.. తమకు జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదని వారు చెప్పడంతో ఉత్తర్వులు అందుకున్న నిరుద్యోగులు తెల్లమొఖం వేశారు.

ఇలా మోసం...: బుద్ధ యోగా ఫౌండేషన్ గుంటూరును కేంద్రం చేసుకుని పని చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో యోగా, పీఈటీ, కంప్యూటర్ ఆపరేటర్, అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ ఉద్యోగాలకు నెలకు రూ.15వేలు చెల్లిస్తున్నట్లు సోషల్ మీడియాలోనూ, పీఆర్వోలను పెట్టి భారీగా ప్రచారం చేశారు. ఇందులో పరోక్షంగా జిల్లా విద్యాశాఖ ఉద్యోగులు, అధికారులు కూడా ఈ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులకు సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఉద్యోగాలలో చేరేందుకు యువత భారీగా పోటీ పడ్డారు. స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఒక్కో నిరుద్యోగ యువత నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేసి, ఆగస్టు నెలలో వలంటీర్ యోగా, పీఈటీ, కంప్యూటర్ ఆపరేటర్, అకడమిక్ ఇయర్-24 వివిధ ఉద్యోగాల పేరుతో అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చి పాఠశాలలో విధుల్లో చేరాలని చెప్పారు. తీరా ఆర్డర్‌తో అక్కడికి వెళితే తమకు డీఈవో కార్యాలయం నుంచి ఉత్తర్వులు రాలేదని పాఠశాలల హెచ్ఎంలు తిప్పి పంపించారు. అభ్యర్థుల నుంచి డబ్బులు వసూళ్లు చేసుకున్న కో ఆర్డినేటర్ వల్లి మొబైల్ ఫోన్ ఔట్ ఆఫ్ నెట్‌వర్క్ అని సమాధానం రావడంతో నిరుద్యోగులు అయోమయంలో పడ్డారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం, జిల్లా సమగ్రశిక్ష ఆఫీసు చుట్టూ మోసపోయిన యువత తిరుగుతున్నా పట్టించుకొనేవారు లేరు. గూడూరు మండలంలోని గూడూరు, పాలకుర్తి, చనుగొండ్ల, బెళగల్ హైస్కూల్‌లో నియామకాలు వచ్చిన వారు జిల్లా సమగ్ర శిక్ష ఆఫీసుకు వచ్చి అడిగితే అలాంటి నియామకాలేవీ లేవని, ఎలాంటి గౌరవ వేతనం ఇవ్వరని తెగేసి చెప్పడంతో తెల్ల మొఖాలు వేశారు. మోసపోయిన తమకు స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధుల నుంచి తిరిగి డబ్బులు ఇప్పించాలని గూడూరు మండలంలోని వడ్ల అరవింద్, దస్తగిరి, శ్రీరాములు అధికారులను కోరారు.

భార్యను హత్య చేసిన మద్యం బానిస



హత్యకు గురైన కృష్ణవేణి

గోనెగండ్ల, అక్టోబరు 13: దసరా కర్రీ పండుగ రోజు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని భార్యను కొట్టి చంపాడు ఓ భర్త. ఈ దారుణ ఘటన గోనెగండ్ల మండలంలోని కులుమాల గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కురువ పక్కీరప్పకు కోడుమూరు మండలం అనుకొండ గ్రామానికి చెందిన కృష్ణవేణితో ఏడేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. కూలీ పనులు చేసుకొని జీవనం సాగించే వారు. కొంత కాలంగా పక్కీరప్ప మద్యానికి బానిసై పనులు మానేసి జులాయిగా తిరిగేవాడు. అయితే కుటుంబ భారమంతా కృష్ణవేణి చూసుకునేది. నిత్యం మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భర్త బాధపెట్టేవాడు. ఆదివారం ఇద్దరు పొలం పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి దసరా కర్రీ పండుగా కావడంతో మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్య కృష్ణవేణితో పక్కీరప్ప గొడవపడ్డాడు. అయితే తన దగ్గర డబ్బులు లేదని భార్య ఎంత చెప్పినా వినిపించుకోలేదు. దీంతో ఇద్దరి మధ్య గొడవ తారాస్థాయికి చేరింది. పక్కనే ఉన్న రాతితో కృష్ణవేణి తలపై కొట్టి కిందకు తోసివేశాడు. రాతి దెబ్బకు తల పగిలింది. తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో కృష్ణవేణి మృతి చెందింది. మృతురాలి తండ్రి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

గాలేరు నగరి కాల్వలో గల్లంతైన బాలుడు మృతి

బనగానపల్లె, అక్టోబరు13: మండలంలోని యాగంటిపల్లె గ్రామానికి చెందిన 12 ఏళ్ల వయస్సుగల మధురుచి అనే బాలుడు ఈనెల 8వతేదీన ప్రమాదవశాత్తు గాలేరు నగరి కాల్వలోపడి గల్లంతయ్యాడు. బాలుడి మృతదేహం ఆదివారం అవుకు చెర్వులో లభ్యమైంది. మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. బాలుడి తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని బనగానపల్లె పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగుగంగలో పడి యువకుడు గల్లంతు



గౌతమ్(ఫైల్)

మహానంది, అక్టోబరు 13: సెల్ఫీ తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారడంతో తెలుగుగంగ ప్రధాన కాల్వలో యువకుడు పడిపోగా, రక్షించేందుకు దూకిన మరో యువకుడు గల్లంతు అయ్యాడు. ఈ ఘటన మహానంది సమీపంలో శనివారం చోట చేసుకుంది. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. వైఎస్ఆర్ జిల్లా బద్వేలుకు చెందిన మహేశ్, సురసుర గౌతం బావాబామ్మర్దులు. మహానందిలో జరిగే బంధువులు వివాహానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మహానంది సమీపంలోకి రాగానే తెలుగుగంగ ప్రధాన కాల్వ వద్ద ఇరువురు సెల్ఫీ తీసుకునేందుకు వాహనాన్ని పక్కకు నిలిపారు. కాల్వ అంచున నిలబడి మహేశ్ సెల్ఫీ తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు కాల్వలో పడ్డాడు. గమనించిన గౌతమ్, మహేశ్‌ను కాపాడేందుకు కాల్వలోకి దూకాడు. అయితే మహేష్ కాల్వ ఒడ్డుకు చేరుకొని చెట్ల సహాయంతో బయటపడ్డాడు. కానీ గౌతం మాత్రం నీటి ప్రవాహానికి కాల్వలో కనిపించకుండా పోయాడు. గౌతమ్ తల్లి మహాలక్ష్మి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. నీటి ప్రవాహానికి కొట్టుకొని పోయిన గౌతమ్ ఆచూకీ కోసం తెలుగుగంగ ప్రధానకాల్వ వెంట సిబ్బంది అన్వేషించినట్లు తెలిపారు.

'నర్సింగ్ ఎన్నికల్లో ఒక వర్గానికే ప్రాధాన్యం'

కర్నూలు(హాస్పిటల్), అక్టోబరు 13: ఏపీ గవర్నమెంటు నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియలో ఒక వర్గానికి అధికారులు కొమ్ము కాస్తున్నారు. ఈ నెల 16వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్ వేసే అభ్యర్థి ఇద్దరు ప్రతిపాదికులను తీసుకరావాలి. ఎన్నికలను నిష్పక్షపాతంగా అధికారులు నిర్వహించాల్సి ఉండగా.. ఒక ప్యానల్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికలను నిష్పక్షపాతంగా జరపకపోతే రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామని కొందరు అంటున్నారు. ఈ విషయంపై కర్నూలు జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 విమలమ్మను వివరణ అడుగగా తాము ఎవరికీ అనుకూలంగా వ్యవహరించడం లేదని అన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆస్పరి, అక్టోబరు 13 : చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆస్పరి గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహేశ్వరమ్మ, భీమేష్ దంపతులు. వీరికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నాయి. అయితే భీమేష్ ఆరు సంవత్సరాల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి కుమారుడు తల్లికి చేదోడుగా వాదోడుగా ఉండేవాడు. కొద్దిరోజుల క్రితం విష జ్వరం బారిన పడిన శివకుమార్(17)ను వైద్యం కోసం ఆదోనికి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. శివకుమార్ మరణ వార్త తెలియగానే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అబ్బుర పరచిన విన్యాసాలు



ఇనుప చువ్వలను గుచ్చుకొని రెండు వైపులపై ఉన్న బండి చక్రాన్ని లాగుతున్న యువకులు







వీపునకు ఇనుప చువ్వలను గుచ్చుకొని విన్యాసాలు చేస్తున్న దృశ్యాలు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 13: ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్లు గ్రామంలో యువకులు చేసిన విన్యాసాలు చూపరులను అబ్బురపరిచాయి. ప్రతియేటా దసరా పండుగా సందర్భంగా దసరారోజు, మరుసటి రోజు గ్రామంలోని యువకులు విన్యాసాలు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే ఈ ఏడాది సైతం గ్రామంలో ఉన్న గచ్చిన గల్లీ, చింతమాను గల్లీ, రామమ్మవ్వ గల్లీల యువకులు విన్యాసాలు చేశారు. ముందుగా ఆయుధ పూజ చేసి పులి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామపెద్ద వై.రుద్రగౌడు ఇంటి ముందు విన్యాసాలు చేశారు. యువకులు వీపునకు ఇనుప చువ్వలను గుచ్చుకొని గాలిలో వేలాడడం, అలాగే రెండు వైపులపై బండి చక్రాన్ని ఒకచోటు నుంచి మరొక చోటుకు లాగే దృశ్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. యువకులు చేసిన కర్రసాము, కర్రపై దూకడం, నేలపైనే పల్టీలు కొట్టడం వంటి విన్యాసాలను చూసి ఈలలు వేశారు. ఈ దృశ్యాలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ శ్రీనివాసులు బందోబస్తు నిర్వహించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

వైభవంగా విజయదశమి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు
- అలరించిన వేషధారణలు

విజయదశమి వేడుకలు జిల్లావ్యాప్తంగా వైభవంగా జరిగాయి. దేవీ శరన్నవరాత్రులు దసరా పండుగతో ముగిశాయి. వేదపండితులు, అర్చకులు శమీపూజ నిర్వహించారు. దుర్గమ్మను నిమజ్జనం చేశారు. దసరా సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గ్రామోత్సవాలు, పల్లకీ సేవ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. అలాగే కళాకారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. పలువురు ప్రముఖులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.


మిడుతూరులో లక్ష్మీచెన్నకేశవ స్వామి గ్రామోత్సవం


జూపాడుబంగ్లా: తూడిచర్లలో జమ్మిచెట్టుకు పూజలు


ఆత్మకూరులో కళాకారుల విన్యాసం


పాణ్యంలో ఆకట్టుకున్న వేషధారణ


నంద్యాల (కల్చరల్): నంద్యాలలో కళాకారుల వేషధారణ


నంద్యాల (కల్చరల్): శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు


బండిఆత్మకూరు: సోమయాజలపల్లెలో..


నంద్యాల (కల్చరల్): నంద్యాలలో నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు బహుమతులు ఇస్తున్న టీడీపీ నాయకుడు ఫయాజ్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, డాక్టర్ రవికృష్ణ, కౌన్సిలర్లు


శ్రీశైలంలో పల్లకీ సేవ


ఆత్మకూరులో దర్గమ్మ నిమజ్జనోత్సవంలో పాల్గొన్న భక్తులు


కొత్తపల్లిలో..


వెలుగోడులో..


పాణ్యం: కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ రాజకుమారి దంపతులు


గడివేముల: దుర్వేసి గ్రామంలో..


పగిడ్యాల: ముచ్చుమర్రి శివాలయంలో పూజలు చేస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

'బాలికలు క్రీడల్లో ఆసక్తి చూపాలి'

ఆత్మకూరు, అక్టోబరు 13: బాలికలు చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి చూపాలని ఆత్మకూరు వాలీబాల్ అసోషియేషన్ సెక్రటరీ, రైల్వేస్ వాలీబాల్ క్రీడాకారులు నిమ్మి కృష్ణయాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలోని స్టేడియంలో నిర్వహించిన బాలికల వాలీబాల్ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈ పోటీలకు విజయవాడకు చెందిన మూడు బాలికల జట్లు ఆహ్వాన జట్లుగా వచ్చాయని తెలిపారు. అదేవిధంగా బాలుర విభాగానికి సంబంధించి తాలుకా స్థాయిలో పోటీలు ఉంటాయని చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో విజేతకు సోమవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పుల్ మున్నా, టీడీపీ నాయకులు వెన్నా శ్రీధర్‌రెడ్డి, రేడియం నూర్, మోటారు షఫీవుల్లా పాల్గొన్నారు.

'బుద్ధుడి బాటలో పయనిద్దాం'

నంద్యాల రూరల్, అక్టోబరు 13: బుద్ధుడు చూపిన మార్గంలో పయనిద్దామని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం నంద్యాలలో ఆ సంఘం ఆధ్వర్యంలో 68వ దమ్మ చక్ర పరివర్తన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా డా.బీఆర్ అంబేడ్కర్, బుద్ధిస్ట్ సంఘాల నాయకులు పాల్గొని గౌతమ బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బహుజనులు, దళితులు, అణగారిన వర్గాలకు రాజ్యాంగం ప్రకారం రావాల్సిన హక్కులు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యక్షుడు కె.బోధి, బీఎస్ఐ నంద్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు రెడ్డిపల్లె ఓబయ్య, కార్యదర్శి సింగరి జీవన్‌రాజ్, నాయకులు కడియం సాంబశివుడు, అశోక్‌అబ్రహం, ఎం.దస్తగిరి, సంజీవరాయుడు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలలో 'పొట్టేల్' చిత్ర బృందం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చిత్ర బృందం సభ్యులు

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 13: నంద్యాల రామక్రిష్ణా డిగ్రీ కళాశాల మినీ ఆడిటోరియంలో పొట్టేల్ సినిమా చిత్రబృందం సందడి చేసింది. ఆదివారం సాయంత్రం సినిమా హీరో యువచంద్రకృష్ణ పొటేల్ సినిమా విడుదల, సినిమాలో ఉన్న సన్నివేశాల గురించి వివరించారు. ఈనెల 25న సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల అవుతుందని తెలిపారు. సినిమాలో దర్శకుడు సాహిత్ చక్కగా చిత్రాన్ని చిత్రీకరించారన్నారు. అనంతరం సినిమా పోస్టర్లను ఆవిష్కరించారు.

నేడు 'పల్లె పండుగ'

జూపాడుబంగ్లా, అక్టోబరు 13: మండలంలోని తాటిపాడు గ్రామంలో సోమవారం ప్రభుత్వం నిర్వహించే పల్లెపండుగ కార్యక్రమం నిర్వహింస్తు న్నట్లు ఎంపీడీవో గోపీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య హాజరై జాతీయ ఉపాధిహామీ కింద మంజూరైన రహదారులను ప్రారంభోత్సవం చేసి, భూమిపూజలో పాల్గొంటారని ఆయన తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిదులు పాల్గొనాలన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఎన్నిక ఏకగ్రీవం

గడివేముల, అక్టోబరు 13: మండల ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని గడివేముల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌గుప్త తెలిపారు. గడివేములలోని అమ్మవారిశాలలో కరిమద్దెలకు చెందిన ఉదయ్‌గిరి శివయ్యను ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని చెప్పారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు శివయ్యకు ఆర్యవైశ్యులు ఘనంగా సన్మానించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఏవో

వెలుగోడు, అక్టోబరు 13: వాతావరణశాఖ హెచ్చరిస్తున్న వర్షసూచన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి పవన్‌కుమార్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో వరిపంటలు పాలు పోసుకొనే దశలో ఉన్నాయని వర్షం ఎక్కువైతే పంల పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, వీలైనంత వరకు ఇప్పుడు పైపాటి ఎరువులు వేయకూడదని సూచించారు. వర్షాలు తగ్గాక పప్పుశనగను నాటుకోవాలన్నారు. కంది పంటలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, లేకుంటే వేరు కుళ్లు, ఎండుతెగుళ్ల సోకే ప్రమాదం ఉందని తెలిపారు.

కామేశ్వరీదేవికి బంగారు తాళిబొట్లు

మహానంది, అక్టోబరు 13: మహానందిలోని కామేశ్వరీదేవి అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్, శ్రావణి దంపతులు దాత రెండు బంగారు తాళి బొట్లను భక్తితో సమర్పించినట్లు ఆలయ ఇన్‌చార్జి పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలోని యాగశాల మంటపంలో దాతలు 5 గ్రాముల రెండు బంగారు తాళిబొట్లను ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధానికి అందజేశారు. అనంతరం దాత దంపతులకు స్వామి వారి ప్రసాదాలు అందచేసి శాలువాతో సన్మానించారు.

'సత్ప్రవర్తనతో మెలగాలి'

నంద్యాల క్రైం, అక్టోబరు 13: నేరచరిత్ర గలవారు, రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని పోలీస్ అధికారులు సూచించారు. జిల్లా పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులకు పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీస్ అధికారులు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లాను నేరరహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పోలీసులు పనిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లు, నేరచరిత్ర గల వారి జీవన విధానం, జీవనోపాధికి వారు చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. నిరంతరం ఇలాంటి వ్యక్తుల కదలికలపై నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.

తిరుపాడులో గౌరు వెంకటరెడ్డి


తిరుపాడులో నాయకులతో మాట్లాడుతున్న గౌరు

గడివేముల, అక్టోబరు 13: మండలంలోని తిరుపాడు గ్రామంలో ఆదివారం టీడీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులతో మాట్లాడారు. అలాగే మండలంలోని వైకే తండా గ్రామంలో జరిగిన దండిమారెమ్మ, సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పాణ్యం నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, మురళీమోహన్‌రెడ్డి, గిరిబాబు, ఐటీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి బాబునాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

గడివేముల, అక్టోబరు 13: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో దసరా సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో 54 టీమ్‌లు పాల్గొనగా గడివేముల టీమ్ మొదటి బహుమతి రూ.20 వేలు, నందికొట్కూరు పట్టణానికి చెందిన జాక్స్పారో రెండో బహుమతి రూ.15 వేలు, గడివేములకు చెందిన టీమ్ ఎలెవెన్ మూడో బహుమతి రూ.10 వేలు, గడివేములకు చెందిన టైకోన్ నాలుగో బహుమతి రూ.5 వేలు గెలుపొందాయి. గెలుపొందిన క్రికెట్ టీమ్‌కు టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి బహుమతులను అందజేశారు. దసరాకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించిన రఫి, చంద్రారెడ్డి, అబ్దుల్లాను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

పాణ్యం, అక్టోబరు 13 : మండలంలోని బలపనూరు మెట్ట హైవే రోడ్డుపై శనివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. వృద్ధురాలి వయసు 60 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. శరీరంపై ఎరుపు రంగు జాకెట్టు, లేత పసుపు, ఆకుపచ్చ, వంగపూత రంగు డిజైన్ చీర ఉన్నట్లు తెలిపారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముఖ్యమంత్రిని కలిసిన మాండ్ర దంపతులు

నందికొట్కూరు, అక్టోబరు 13: విజయదశమి సందర్భంగా హైదరాబాదులోని నంద్యాల టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సంబంధించి వెసెల్లా మెడోస్ కాలనీకి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాదులోని వెసెల్లా మెడోస్ కాలనీలో ఓ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాండ్ర శివానందరెడ్డి, మాండ్ర ఉమాదేవి దంపతులు సీఎం చంద్రబాబు నాయుడుకు, నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.


చంద్రబాబు, లోకేశ్‌తో మాండ్ర దంపతులు



దేశ సమగ్రతే ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన లక్ష్యం

- ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యకారిణి యుగంధర్

ఆత్మకూరు, అక్టోబరు 13: దేశ సమగ్రతే ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన లక్ష్యమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యకారిణి యుగంధర్ పేర్కొన్నారు. ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పాటై 99ఏళ్లను పురస్కరించుకుని ఆత్మకూరులోని జి.పుల్లారెడ్డి స్కూల్‌లో నిర్వహించిన విజయదశమి ఉత్సవ కార్యక్రమానికి ఆయన ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 2025 నాటికి ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పంచ పరివర్తన్ అంశాలను ప్రజల్లో తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. అంతకు ముందు భరతమాత, ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు హెడ్గేవార్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ఆత్మకూరు ఖండ కార్యవాహ వాసుదేవరెడ్డి ఉన్నారు.


మాట్లాడుతున్న యుగంధర్

'గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి'

పగిడ్యాల, అక్టోబరు 13: గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించడానికి ప్రజా ప్రతినిదులు, అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు పక్కీరు సాహెబ్ డిమాండ్ చేశారు. సీపీఎం మహాసభల సందర్భంగా బీరవోలు గ్రామంలో పార్టీ జెండాను ఆదివారం ఆవిష్కరించారు. అనతరం సీపీఎం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఎం నాయకులు బాబు మునిస్వామి, తిక్కస్వామి, వెంకటేశ్వర్లు, ప్రభాకర్ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా మద్యం దుకాణానికి డిమాండ్

- 50 దరఖాస్తులు.. ప్రభుత్వానికి రూ.కోటి ఆదాయం

జూపాడుబంగ్లా, అక్టోబరు 13: నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా మద్యందు కాణానికి డిమాండ్ ఏర్పడింది. నియోజవర్గంలోని 10 మద్యం దుకాణాలకు ఇటీవల ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈనెల 11వ తేదీ గడువు ముగియడంతో మొత్తం 182 దరఖాస్తులు వచ్చినట్లు అబ్కారీశాఖ సీఐ రామాంజనేయులు తెలిపారు. అత్యధికంగా జూపాడుబంగ్లా మద్యం దుకాణం దక్కించుకునేందుకు ఏకంగా 50మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కొక్కరు రూ.2 లక్షలు డీడీ చెల్లించడంతో ప్రభుత్వానికి ఒక్క జూపాడుబంగ్లా మండలం నుంచే రూ.కోటి రుపాయల ఆదాయం వచ్చింది. నందికొట్కూరు నియోజకవర్గంలోని అన్ని దుకాణాకంటే జూపాడుబంగ్లా దుకాణం అమ్మకాలు బాగా జరిగి ప్రతిరోజు సరాసరి రూ.2 లక్షల వరకు వస్తుందని భావించి ఇంతమంది దరఖాస్తులు చేసుకోవడానికి కారణమని పలువురు చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా జాతీయ రహదారి కూడా జూపాడుబంగ్లా మండలంలోని గ్రామాలను కలుపుకుంటూ వెళుతోంది. దీంతో మరింత గిరాకీ ఉండవచ్చని ఆశావాహులు ఎక్కువగా దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది. నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు రూరల్‌లో రెండు దుకాణాలకు కలిపి 24 దరఖాస్తులు, నందికొట్కూరు పట్టణంలోని 4 దుకాణాలకు 71 దరఖాస్తులు, మిడుతూరు మండలంలో రెండు దుకాణాలకు 27 దరఖాస్తులు, పగిడ్యాల మండలంలో ఒకదుకాణానికి 10 దరఖాస్తులు, జూపాడుబంగ్లా మండలం ఒక దుకాణానికి 50 దుకాణాలు వచ్చినట్లు అబ్కారీశాఖ అధికారులు వెల్లడించారు. సోమవారం నిర్వహించే లాటరీ ఎవరికి తగులుతుందోని ఆశావాహులు ఎదురుచూస్తున్నారు.

టీడీపీతోనే సనాతన ధర్మ పరిరక్షణ

కొలిమిగుండ్ల, అక్టోబరు 13 : తెలుగుదేశం పార్టీతోనే సనాతన ధర్మ పరిరక్షణ సాధ్యమవుతుందని టీడీపీ బనగానపల్లె నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో టీటీడీ వారి సమరసత, బీజేపీ, హిందూ సంఘాల వారి ఆధ్వర్యంలో సనాతన ధర్మ పరిరక్షణ కోరుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సనాతన ధర్మం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివశంకర్, మాజీ సర్పంచ్‌లు ఓబులేసు, రామలక్ష్మణ్ణ, వెంకటేసు, ప్రముఖ గాయకులు పెద్దిరెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సమయానికి సబ్సిడీ విత్తనాలు

కొలిమిగుండ్ల, అక్టోబరు 13 : రైతులకు ఇబ్బంది తలెత్తకుండా ప్రభుత్వం రబీ సీజన్ సమయానికి సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేస్తోందని మండల టీడీపీ అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని కమ్మవారిపల్లె గ్రామంలో టీడీపీ నాయకులు కత్తి రాందాస్ అధ్యక్షతన, ఏవో భూమా జ్యోతి ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఆదిరానాయణ, మురళి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కోవెలకుంట్ల, అక్టోబరు 13 : యువత గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని వల్లంపాడు గ్రామ సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లోని వల్లంపాడు గ్రామంలో దసరా పండుగ సందర్భంగా భారత గ్రంథాలయాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డితో కలిసి సర్పంచ్ నూతన గ్రంథాలయం ప్రారంభించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, పెద్దరామిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై వాల్మీకుల హర్షం

డోన్, అక్టోబరు 13: వాల్మీకి మహర్షి జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తుందని సీఎం చంద్రబాబు నిర్ణయంపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, వాల్మీకి సంఘం నేత వలసల రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలో వాల్మీకి సంఘం నాయకులు మిద్దెపల్లి గోవిందు, ఉంగరానిగుండ్ల చిన్నమిద్దలతో కలిసి వలసల రామకృష్ణ మాట్లాడుతూ వాల్మీకుల మనోభావాలను గౌరవించి టీడీపీ కూటమి ప్రభుత్వం వాల్మీకి మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించడం శుభపరిణామమన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తారని చంద్రబాబుపై నమ్మకం ఉందని రామకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు.

వాలీబాల్ విజేత బాచేపల్లె జట్టు



చాగలమర్రిలో రాయలసీమ స్థాయి వాలీబాల్ విజేతలకు నగదు అందజేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, అక్టోబరు 13: చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరిగిన సిద్ధిక్ మెమోరియల్ రాయలసీమ స్థాయి వాలీబాల్ పోటీలో బాచేపల్లె జట్టు మొదటి స్థానంలో గెలుపొందింది. ఈ జట్టుకు రూ.10 వేల నగదును టీడీపీ నాయకుడు మహమ్మద్ ఆదివారం అందజేశారు. 2వ స్థానంలో చాగలమర్రికి చెందిన సిద్ధిక్ జట్టు, మూడో స్థానం ఖాజీపేటకు చెందిన కార్తీక్ టీమ్ విజయం సాధించింది. రెండో స్థానం సాధించిన క్రీడాకారులకు రూ.7 వేలు నగదును టీడీపీ నాయకులు ఖలీల్, ఇర్షాద్, మూడవ బహుమతి రూ.5 వేలు నగదును పీడీ దాదాపీర్ అందజేశారు. కార్యక్రమంలో యువ క్రీడాకారులు షరీఫ్, బార్గవ్, అలి, నరేష్, అబూబకర్, జుబేర్, అల్తాఫ్, షాహిద్, అలేక్స్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

చాగలమర్రి, అక్టోబరు 13: చాగలమర్రి గ్రామంలోని గ్రామ దేవత చాగలమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంతక ముందు ఆలయంలో చాగలమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. చౌడేశ్వరి ఆలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, హిందూ సంఘ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, నర్సిరెడ్డి, రామతీర్థం, నాగరాజు, సుబ్బయ్య, కృష్ణమూర్తి, రంగయ్య, ప్రతాప్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

'పల్లె పండుగ' వారోత్సవాలకు నిధులు మంజూరు

బనగానపల్లె, అక్టోబరు 13: మండలంలో నిర్వహించనున్న పల్లె పండుగ వారోత్సవాలకు బనగానపల్లె మండలానికి రూ.7.40 కోట్లు నిధులు మంజూరు నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో రమణ ఆదివారం తెలిపారు. గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలకు ఈ నిధులు ఉపయోగిస్తామన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం నుండి పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉమమహేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా మండలానికి రూ. 1.93 కోట్ల నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు.

దొర్నిపాడు: మండలంలోని గ్రామాల్లో 14 నుంచి 20వ తేదీ వరకు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సావిత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని గ్రామ పంచాయతీ, ఉపాధి సిబ్బంది, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, గ్రామ నాయకులు హాజరు కావాలని అన్నారు.



వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ ఉత్సవమూర్తుల ఊరేగింపు



అహోబిలంలో ఊరేగింపుగా వెళ్తున్న స్వామి

ముగిసిన దసరా ఉత్సవాలు

దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని జిల్లాలో ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్, నియోజకవర్గాల్లో గత 9 రోజులుగా దుర్గామాత విగ్రహాలకు భక్తులు విశేష పూజలు చేశారు. ఆదివారం రాత్రి దుర్గామాత విగ్రహాలు గ్రామోత్సవంగా గంగమ్మ ఒడికి చేరాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. - ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



నందవరంలో చౌడేశ్వరీమాత అలంకారంలో అమ్మవారు



కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లెలో నిజరూప దర్శనంలో అంకాళమ్మ



ఉయ్యాలవాడ: ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



చాగలమర్రి: విజయలక్ష్మీదేవి అలంకారంతో ఊరేగింపు



దొర్నిపాడు: విజయలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు



హరివరం: అమ్మవారి గ్రామోత్సవం



బేతంచెర్ల: విజయదుర్గాదేవి అలంకరణలో వాసవిమాత



చాగలమర్రి: వివిధ వేషధారణలో యువకులు



బేతంచెర్ల: జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న అర్చకులు



శిరివెళ్ల: వాసవీ కన్యకా పరమేశ్వరి అలంకారంలో అమ్మవారు




గ్రామోత్సవంలో యువత



బేతంచెర్ల: అమ్మవారి ఊరేగింపులో భక్తుల కోలాటం



రుద్రవరంలో అమ్మవారి గ్రామోత్సవం



డోన్‌లో..



ప్యాపిలి పెద్దమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కళాకారుల విన్యాసాలు



డోన్‌లో కోలాటాల మధ్య అమ్మవారి ఊరేగింపు



బేతంచెర్ల: అమ్మవారికి పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

డీఎస్పీకి సత్కారం

బనగానపల్లె, అక్టోబరు 13: ఇటీవల డీఎస్పీగా పదోన్నతి పొందిన పత్తికొండకు చెందిన కృష్ణమోహన్ దంపతులను బనగానపల్లె నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రావు ఆదివారం సత్కరించారు.



డీఎస్పీ కృష్ణమోహన్ దంపతులను సత్కరిస్తున్న నాయీబ్రాహ్మణులు

పట్టణంలోని సీతారామాలయంలో డీఎస్పీ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో బనగానపల్లె నాయీబ్రాహ్మణ సంఘం తరపున సంఘ గౌరవాధ్యక్షుడు పాతపాడు శ్రీరాములు, డాక్టర్ ఎమ్మార్ శ్రీనివాసులు, కోశాధికారి శివయ్య, హెచ్ఎం రామకృష్ణయ్య, మద్దిలేటి, మల్లిఖార్జున, రామమద్దిలేటి, ఇతర సంఘం సభ్యులు సత్కరించారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభ



రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో రాణించిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

రుద్రవరం, అక్టోబరు 13: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో ఆదర్శపాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు ఆదివారం తెలిపారు. ఈ నెల 3 నుంచి 5 వరకు క్రిష్ణాజిల్లా విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 19 కుస్తీ పోటీల్లో విద్యార్థులు రాణించారని చెప్పారు. నాగదినేశ్, సాయికుమార్, శశిదర్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మెడల్ సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.



దేవస్థానం కమిటీ అధ్యక్షుడిగా

శ్రీనివాసులుగౌడు ఎన్నిక

డోన్(రూరల్), అక్టోబరు 13: పట్టణంలోని కొండపేటలో వెలసిన ఎల్లమాంబేశ్వర స్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షుడిగా ఏఈ శ్రీనివాసులుగౌడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం దేవస్థానం కమిటీ సభ్యుల సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా ఉమాశంకర్, ప్రధాన కార్యదర్శి అన్నాటి ఈడిగ నాగరాజు, కోశాధికారిగా అక్షితలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సంజామల, అక్టోబరు 13: ఆల్వకొండ గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు ఎస్ఐ రమణయ్య ఆదివారం తెలిపారు. గ్రామం వెలుపల కంపచెట్లలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద రూ. 3,450 నగదును స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భూమా దంపతులకు నివాళి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 13: దసరా పర్వదినం సందర్భంగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే దంపతులు భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ నాయుడు, యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి భూమా ఘాట్‌లో నివాళి అర్పించారు. దివంగత నేతలు భూమా నాగిరెడ్డి, భూమా శోభానాగిరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి వారి సమాధుల వద్ద నివాళి అర్పించారు.

ఎగువ అహోబిలంలో పవిత్రోత్సవాలు

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), అక్టోబరు 13 : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలంలో పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. యాగశాల ప్రవేశం, తిరుమంజనం, అధివాస హోమంతో అర్చకులు ఉత్సవాలకు అంకురార్పణం చేశారు. ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, నవకలశ తిరుమంజనం, మండల, కుంభ ప్రతిష్ట, హోమం నిర్వహించారు. జ్వాలా నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్య నారాయణన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి.



ఎగువ అహోబిలంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో జ్వాలా నరసింహస్వామి, అమ్మవార్లు

లక్ ఎవరికో..?

- 16 మద్యం దుకాణాలకు నేడు లాటరీ
- ఎవరికి దక్కేనో అన్నది ఉత్కంఠ...?

డోన్, అక్టోబరు 13: ప్రైవేటు మద్యం దుకాణాలపైనే అందరి దృష్టి నెలకొంది. మద్యం దుకాణాల ల్యాటరీలో.. లక్ ఎవరిదో అన్నది సర్వత్రా ఉత్కంఠగా నెలకొంది. డోన్ నియోజకవర్గంలో మద్యం దుకాణాలు ఎవరికి దక్కుతాయో అన్నది ఎక్కడ చూసినా చర్చగా మారింది. నియోజకవర్గంలోని డోన్ మున్సిపాలిటీలో 4 మద్యం దుకాణాలకు 153 దరఖాస్తులు వచ్చాయి. రూరల్‌లోని 2 మద్యం దుకాణాలకు 47 దరఖాస్తులు, బేతంచెర్ల మున్సిపాలిటీలో 4 మద్యం దుకాణాలకు 89 దరఖాస్తులు, రూరల్‌లో3 మద్యం దుకాణాలకు 51 దరఖాస్తులు అలాగే ప్యాపిలి మండలంలో 3 మద్యం దుకాణాలకు 45 దరఖాస్తులు వచ్చాయి. నియోజకవర్గంలోని 16 మద్యం దుకాణాలకు భారీ ఎత్తున్న 385 దరఖాస్తులు రావడంతో.. సర్వత్రా ఉత్కంఠగా మారింది.



- **నేడు మద్యం దుకాణాలకు లాటరీ దక్కేదెవరికి:** నంద్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలకు సోమవారం లాటరీ నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని 66వ మద్యం దుకాణం నుంచి 81వ మద్యం దుకాణం వరకు లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలను కేటాయించనున్నారు. ఒక్కో మద్యం దుకాణానికి 17 నుంచి 40 వరకు దరఖాస్తులు వచ్చాయి. దీంతో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలు ఎవరికి దక్కుతాయో అన్నది సర్వత్రా ఉత్కంఠ లేపుతోంది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

ఉయ్యాలవాడ, అక్టోబరు 13: మండలంలోని హరివరం గ్రామ ఉన్నత పాఠశాలలోని పూర్వ విద్యార్థులు 17 ఏళ్ల తురువాత కలసుకున్నారు. 2006-07 ఏడాదిలో పదో తరగతి చదివిన విద్యార్థులు కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ గురువులను శాలువా, పూలమాలతో సన్మానించారు.